క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



తెనాలిటౌన్: పట్టణ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ప్రధాన ఆలయంలో ఆదివారం కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దుర్భా హరిబాబు స్వామి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఏ.వెంకట లక్ష్మి శిష్య బృందం సభ్యులు నృత్యం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని హరిబాబు స్వామి ప్రారంభించి భక్తులకు అన్నదానం చేశారు.

కారులో రూ.లక్ష నగదు పట్టివేత

తెనాలిరూరల్: కారులో తరలిస్తున్న రూ.లక్ష నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తి తన కారులో రూ.లక్ష నగదుతో తెనాలి నుంచి అంగలకుదురు వైపు వెళుతుండగా జేఎంజే కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద త్రీ టౌన్ పోలీసులు కారును తనిఖీ చేశారు. డ్యాష్ బోర్డులో లక్ష నగదు ఉండగా స్వాధీనం చేసుకుని నగదుకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని సదరు వ్యక్తికి తెలిపారు. నిబంధనలకు మించి ఎవరూ నగదును తరలించకూడదని సీఐ ఎస్.రమేష్‌బాబు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండ సత్యసాయి పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 118 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 87 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి, ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించేందుకు తీసుకెళ్ళనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్ల కోటేశ్వరరావు, ధూళిపాళ్ళ ఏసుబాబు, ధనేకుల హరిబాబు, షేక్ రఫీ, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వంశీ, పీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సాయినాథ వార్షికోత్సవం ప్రారంభం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ ఆలయ 22వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు రాఘవేంద్రశర్మ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహ ఆరాధన పూజలు చేశారు. ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో అష్టదిక్పాల పూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. సాయంత్రం సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రూ. 2,79,290 నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు చెక్‌పోస్టులో వాహనాల సాధారణ తనిఖీ నిర్వహిస్తుండగా ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.2,79,290 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు తెలిపారు. గుంటూరుకు చెందిన ఆంధ్ర శ్రీనివాసరావు అనే వ్యక్తి గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తుండగా తనిఖీలో నగదు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించి, సదరు నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు వారు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఒక్కో వ్యక్తి రూ.50 వేలలకుపైబడి నగదు, రూ.10 వేలకు పైబడిన బంగారు ఆభరణాలు, ఎలాంటి రసీదులు లేకుండా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు.

దుగ్గిరాల ఆరోగ్య కేంద్రం డాక్టర్‌కు అవార్డు



మంగళగిరి: టీబీ నివారణకు కృషి చేసిన దుగ్గిరాల ఆరోగ్య కేంద్రం డాక్టర్ మహమ్మద్ ఇజాజ్ అబ్దుల్ రహమాన్‌కు అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం అంతర్జాతీయ క్షయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ వైద్యాధికారిగా ఎంపికయిన అబ్దుల్ రహమాన్ తెనాలి జిల్లా వైద్యశాలలో జాతీయ క్షయ ఎలిమినేషన్(ఎన్‌టీఈపీ) కార్యక్రమంలో వైద్యశాల ఆర్‌ఎంవో డాక్టర్ మల్లికార్జున, టీబీ కంట్రోల్ వైద్యాధికారి డాక్టర్ రాధిక చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

'టూరిస్టు వీసాలపై వచ్చేవారిని నమ్మి మోసపోవద్దు'

- వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య
- తెనాలిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- ఎమ్మెల్యే శివకుమార్, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి తో కలిసి గంగాదేవి ఆలయంలో పూజలు
- టీడీపీ నాయకులను నమ్మి మోసపోవద్దని హితవు



తెనాలిలో గంగాదేవి ఆలయంలో పూజల్లో కిలారి రోశయ్య, డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య తెనాలి నియోజకవర్గంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో కలిసి ఆదివారం ఇక్కడికి వచ్చిన రోశయ్య, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక గంగానమ్మపేటలోని గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నేతలను, సీనియర్లను స్వయంగా కలిశారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి కుమారి నివాసానికి వెళ్లారు. జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరారు.

ఆలమూరి నివాసంలో మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలు, సమస్యలను తెలుసునేందుకు స్థానికులను కలుస్తున్నట్టు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులు, నాబార్డు నిధులతో చేపట్టేందుకు అవకాశం ఉన్న పనులను గుర్తిస్తామన్నారు.

గతంలో రెండు సార్లు ప్రజలు గెలిపించిన టీడీపీకి చెందిన గుంటూరు పార్లమెంటు సభ్యుడు గత పదేళ్లుగా ఒక్కసారి కూడా ఓటర్లకు కనిపించిన పాపాన పోలేదన్నారు. పొన్నూరు శాసనసభ్యుడైన తాను గత అయిదేళ్లలో ఒక్కరోజైనా ఆయన్ను చూడలేదన్నారు. కేంద్ర నిధులను తీసుకొచ్చి ఏవైనా అభివృద్ధి చేయటం మాట అటుంచితే ఎంపీ లాడ్స్ నిధులు సైతం మురగబెట్టిన చరిత్ర ఆయనదని రోశయ్య వ్యాఖ్యానించారు. 'ఇప్పుడు టూరిస్టు వీసాపై మరో వ్యక్తి వచ్చాడు..ఆయన తూకంకన్నా నా తూకం పెద్దది అంటున్నాడు..స్థానికంగా ఏమాత్రం అవగాహన లేని వ్యక్తి' అని టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ను ఉద్దేశించి అన్నారు. స్క్రిప్టు రీడింగ్‌కు పనికొస్తాడనీ, ఎవరైనా రాసిస్తే దాన్ని అనర్గళంగా చదవగల దిట్ట అని ఎద్దేవా చేశారు. స్థానికంగా వీరికి ఎలాంటి అవగాహన ఉండదనీ, ప్రజలకు అందుబాటులో ఉండరని అన్నారు.



మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి నివాసంలో మాటామంతీ

గుంటూరు పార్లమెంటు ప్రజలు మూడోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరని స్పష్టంచేశారు. స్థానికంగా ఉంటూ మిర్చి, పత్తి, అపరాలు, పసుపు వ్యాపారులతో సత్సంబంధాలు కలిగిన తాను టీడీపీ పార్లమెంటు సభ్యులు గత పదేళ్లుగా మరుగున పెట్టిన గుంటూరు ఖ్యాతికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. వీరితో వైఎస్సార్ సీపీ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, నాగుమోతు శివనాగేశ్వరరావు, కాకి దేవ సహాయం, జేబీ జిలాని, సయ్యద్ షబ్బీర్, బచ్చనబోయిన శ్రీనివాసరావు, గోల్డ్ రహిమా, పెచ్చింగ్ సుభాని, సయ్యద్ గ్యాస్ సుభాని, కఠెవరపు దేవానంద్, కోలా వాసు, కొడాలి క్రాంతి, కాళిదాసు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ సుదీర్ఘ పాలనతోనే రాష్ట్రానికి మేలు

- శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- సామిల్లు వ్యాపారుల ఆత్మీయ సమావేశానికి హాజరు

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు నేరుగా సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతూ చేసిన పరిపాలన చారిత్రాత్మకమని శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. ఒక్కసారి ముఖ్యమంత్రిగా చేస్తేనే ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకుని ఆయన అమలు చేసిన పథకాలు ఇంకెవ్వరికీ సాధ్యపడవనే రీతిలో పాలన సాగించిన తీరును గుర్తుచేశారు. 42 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఇంతటి నిష్టాతుడైన సీఎం దగ్గర పనిచేసే అవకాశం వచ్చినందుకు గర్వపడుతున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి ఆదివారం సాయంత్రం ఇక్కడి వార్ఫ్‌రోడ్డులో టింబర్, సామిల్లు వ్యాపారులతో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. పార్టీ నాయకుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గతంలో చాలా రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు వందలాది పేజీల మేనిఫెస్టోలను పంచి ఎన్నికల తర్వాత ప్రజలకు కనిపించకుండా చేశాయన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో వచ్చిన ప్రజా విజ్ఞప్తులను కేవలం రెండు పేజీల మేనిఫెస్టోలో పొందుపరిచి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత సాధించారని చెప్పారు. అయిదేళ్లలో ప్రజలు కోరుకున్న వాటిల్లో కానిది ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. తన దార్శనికతతో రాబోయే రోజుల్లో ఎవరూ ఊహించనంతకాలం పరిపాలన చేయబోతున్నారని ఉమ్మారెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్యను, ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నాబత్తుని శివకుమార్‌ను గెలిపించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వేదికపై కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్

గుంటూరు ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ గత పార్లమెంట్ సభ్యుడు కేంద్రం నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో అవకాశం ఉన్నా ఏ ఒక్కటీ తేలేదని గుర్తుచేశారు. ప్రజలను మోసం చేసే తత్వం వారి మాటల్లోనే స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. ఆంధ్రా ప్యారిస్ తెనాలిని కల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే పేరొందిన తెనాలి కలప వ్యాపారంలో రాజకీయ జోక్యం లేకుండా చూశానని గుర్తుచేశారు. గతంలో డీలిమిటేషన్‌లో తెనాలి ఎంపీ స్థానం కోల్పోవటంతో ఎంతో వెనుకబాటుకు గురైందన్నారు. తాను, రోశయ్య కలిసి ఈసారి డీలిమిటేషన్‌లో తెనాలికి గత వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కోట శ్రీనివాస్ తన ప్రసంగంలో రాబోయే రోజుల్లో కాపులకు ప్రాధాన్యం కీలకం కాబోతుందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు కాపులకు పెద్దపీట వేశారని చెప్పారు. టింబర్ వ్యాపారి కొసనా పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు, కఠారి హరీష్, బూరెల దుర్గాప్రసాద్, టింబర్, సామిల్ వ్యాపారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ సంకల్పంతోనే కులగణన

వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ గౌడ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

తెనాలి: దేశవ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్న కులగణనను కార్యరూపంలోకి తెచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ గౌడ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాత్రి ఇక్కడి నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో అద్దంకి వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. డాక్టర్ ఉమ్మారెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ జనాభా ప్రకారం ఏ కులానికి దక్కాల్సిన వాటా వారికి దక్కితీరుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో ప్రతి రాష్ట్రం కులగణనకు వెళ్లనుందని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సమాజం కోసం మళ్లీ మళ్లీ ఎన్నుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పైసా అవినీతి లేకుండా అన్ని కులాల్లోని పేదలకు రూ.2.76 లక్షల కోట్ల సంక్షేమం నేరుగా అందిన కారణంగానే రాష్ట్రంలో గత అయిదేళ్లుగా ఎలాంటి కుల ఉద్యమాలు లేవని గుర్తుచేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి దేశానికే దిక్సూచిగా నిలిచారని చెప్పారు. వివిధ కార్పొరేషన్ పదవులతో సహా 90 వేల మందికి పదవులను ఇచ్చారని ప్రస్తుత ఎన్నికల్లో గౌడ సంఘీయులకు 8 అసెంబ్లీ సీట్లు, రెండు ఎంపీ సీట్లను కేటాయించారని చెప్పారు.ఇదే సామాజిక వర్గానికి డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.15, 200 కోట్ల సంక్షేమాన్ని అందించినట్టు తెలిపారు. ఎన్ని పార్టీలను కలుపుకుని వచ్చినా జగన్‌ను ఓడించటం సాధ్యం కాదన్నారు. తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ అయిదేళ్ల క్రితం గౌడ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆ వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించినట్టు సోదాహరణంగా చెప్పారు. సామాజిక సాధికారతకు నిజమైన అర్థం చూపిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు.



మాట్లాడుతున్న కిలారి వెంకట రోశయ్య వేదికపై డాక్టర్ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

ఏపీ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణగౌడ్ తన ప్రసంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గౌడ సంఘీయులకు చేసినంత సాయం గతంలో మరే ప్రభుత్వమూ చేయలేదన్నారు. సంక్షేమాన్ని అందించటమే కాకుండా నూతన గీత కార్మికుల పాలసీతో చెట్టుపై నుంచి మరణించిన, శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్న ప్రభుత్వం ఇదేనని చెప్పారు. వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, గౌడ సంఘ నేతలు తుళ్లూరు శ్రీనివాసరావు గౌడ్, కందుల సాంబశివరావు గౌడ్, లుక్కా శ్రీరాములు గౌడ్, ఎంపీటీసీ కార్తికేయ మాట్లాడారు. తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, నియోజకవర్గంలోని గౌడ వర్గానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సభకు ముందు భారీ ఊరేగింపుతో అభ్యర్థులను సభాస్థలికి తోడ్కొని వచ్చారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

పట్టణంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శన

తెనాలిఅర్బన్: మట్టల ఆదివారం వేడుకలను తెనాలిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో చిన్నారులు పూలతో అలంకరించిన ఈత మట్టలను పట్టుకుని యూదుల రాజు హోసన్నా.. యూదుల రాజు ఏసన్న అంటూ నినాదాలు చేశారు. క్రైస్తవ గీతాలను అలపిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఐతానగర్‌లోని క్రీస్తు కృపాలయం లూథరన్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను నిర్వహించారు. పాస్టర్ విబి సర్వోన్నతరావు మాట్లాడుతూ యేసుక్రీస్తు లోకరక్షకుడిగా భూమిపై జన్మించారని తెలిపారు. ఆయనను హోసన్నా అంటూ ప్రజలు ఊరేగించారని చెప్పారు. యేసుక్రీస్తు ప్రజల పాపాల కోసం శిలువలో మరణించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ సునీల్, బీ దయాసాగర్, జి సురేష్, ప్రకాష్, కె.రుషేబాబు, పి దాసు, రాజేష్, ప్రదీప్, క్రాంతికుమార్, వి.రామకృష్ణ, పెద్ద సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

- చినరావూరులోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను నిర్వహించారు. చిన్నారులు ఆ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించి క్రైస్తవ గీతాలను అలపించారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్లు పిల్లి ప్రేమరాజు, దీనమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.
- ఐతానగర్‌లోని రక్షణ సైన్యం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు అందంగా పూలతో అలంకరించిన మట్టలను పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మేజర్ నాగరాజు, సంఘపెద్దలు రవి, కనకరత్నం, నరసింహారావు, ఆశీర్వాదం, జక్రయ్య, నిర్మల, రత్నావతి, తదితరులు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: రూరల్ మండల గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువకులు, మహిళలు, చిన్నారులు ఈత, కొబ్బరి మట్టలకు పూలు గుచ్చి గ్రామాల్లోని వీధులలో హోసన్నాకు జయం అంటూ ప్రదర్శనలు చేశారు. చావావారిపాలెం గ్రామంలో లూథరన్ చర్చిలో రెవరెండ్ పి.వరబాబు పర్యవేక్షణలో ప్రదర్శన జరిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రమేష్, దైవ సేవకురాలు పి.విజయశ్రీ, సంఘస్తులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

- కొలకలూరులోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ రెవరెండ్ సాగర్ థామస్ ప్రత్యేక దివ్యబలి పూజను నిర్వహించారు. బైబిల్ గ్రంథం నుంచి వాక్యోపదేశం చేశారు. కొబ్బరి ఆకులకు పూలు గుచ్చి చర్చి చుట్టూ ప్రదర్శన జరిపారు. జూబ్లీ స్మాల్‌సిస్టర్స్, పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.
- ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో మట్టల ఆదివారం వేడుకలు జరిపారు. హోసన్నా జయం అంటూ దేవుని స్తుతించారు. సంఘకాపరి, దైవజనులు బ్రదర్ ఆనందన్న, బ్రదర్ పి.చార్లెస్ వెస్లీలు మట్టల ఆదివారం విశిష్టతను తెలియజేశారు. దైవసేవకురాలు రత్నకుమారి, సంఘస్తులు, మహిళలు పాల్గొన్నారు.
- రూరల్ మండల గ్రామాల్లోని బాప్టిస్టు చర్చిలు, లూథరన్ చర్చి, ఆర్‌సీఎం చర్చిలు, ఇతర దేవుని ప్రార్థనా మందిరాల్లో మట్టల ఆదివారం వేడుకలను జరిపారు.



సాల్వేషన్ ఆర్మీ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు



చినరావూరులో ర్యాలీలో పాల్గొన్న లూథరన్ చర్చి చిన్నారులు



లూథరన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో నినాదాలు చేస్తున్న చిన్నారులు



చావావారిపాలెంలో మట్టలు చేతపట్టి ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్లు, చిన్నారులు

మంచి పాలకులతోనే సమాజ ప్రగతి





మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, నృత్యాలు చేస్తూ అవగాహన కల్పిస్తున్న యువత

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమాన్ని చినరావూరు పార్కులో ఆదివారం సాయంత్రం వినూత్న రీతిలో నిర్వహించారు. పలువురు కళాకారులు పాటల ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. సీనియర్ సిటిజన్‌లు ఓటు ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ మంచి సమాజం ఏర్పడాలంటే మంచి పాలకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో మెప్మా సీఎంఎం మాధవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, వాకర్స్, పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని రోటరీ ఇంటర్నేషనల్ బోర్డు డైరెక్టర్ వడ్లమాని రవి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్లమాని రవి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాల్ని గుర్తించి, అధ్యాపకుల సహకారంతో వాటిని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యావంతులుగా, నైపుణ్యవంతులుగా ఎదిగి, తల్లిదండ్రులతో పాటు చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో వార్షికోత్సవం ఒక మరపురాని ఘట్టమన్నారు. ప్రతి విద్యార్థి కళాశాల నుంచి ఎన్నో మంచి విషయాలను నేర్చుకుని భవితకు పునాది వేసుకుంటారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో హిందూ కళాశాల ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. సమాజంలో ఉన్నతస్థాయిలో రాణిస్తున్న ఎంతో మంది ప్రముఖులకు విద్యాసంస్థలు విద్యను బోధించాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుబ్బారావు, మేనేజ్‌మెంట్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్లమాని రవి

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం



పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌లో నివాసం ఉండే చుండూరి నాగరాజు దుస్తులు ఉతికే పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు అధికమై ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల నివాసాల్లో కుటుంబసభ్యులు అడిగినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో నాగరాజు భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 8688831325, 8688831329 నంబర్లకు సమాచారాన్ని అందించాలని పోలీసులు కోరారు.

క్షయ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోండి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాల ఆర్‌ఎంవో డాక్టర్ పి.మల్లికార్జునరావు సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ ర్యాలీని మార్తా గ్రూప్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వైద్యశాల వద్ద నిర్వహించారు. ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన విభాగ వైద్యాధికారి డాక్టర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ క్షయ వ్యాధి ఊపిరితిత్తులు, చర్మం, ఎముకలకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఊపిరితిత్తులకు అది వ్యాపిస్తే అత్యంత ప్రమాదంగా భావించాలని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ రెహమాన్, మార్తా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ వై.ఈశ్వర్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, హెచ్‌వీలు ప్రసన్న, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మల్లికార్జునరావు

వైభవంగా శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నిత్య హోమం, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ స్వహస్తాలతో హోమ పూర్ణాహుతి అనంతరం వేల సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. శ్రీవశిష్ఠాశమం ఉత్తరాధికారి శ్రీ విశ్వంభరానందగిరిస్వామి, శేషాచలాశ్రమం పీఠాధిపతి శ్రీ నిర్వకల్పానందస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సాహితీవేత్తలు యాబలూరి లోకనాథశర్మ, నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి, నారాయణం ప్రసాదాచార్యులు, నోరి నారాయణమూర్తి బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మండవ వెంకట రామయ్య దంపతులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.